సింగిల్ పేజీ కథ

# రేటు చెప్పకు

-ఆకెళ్ళ గిరిజ

## అదో చిన్న కాలనీ.

మధ్యతరగతి కుటుంబాల వారు నివసిస్తున్నకాలనీ. ఆ కాలనీలోకి ఈ మధ్యే షిఫ్ట్ అయ్యారు వాసుదేవరావు లలితాను.

ఓ రోజు మిట్ట మధ్యాహ్నం ఎండ విరక్కాస్తోంది.

"మిరపకాయలు...మిరపకాయలోయ్..." కేక వినిపిస్తోంది.

లలిత గబగబా బయటకొచ్చింది.

అప్పటికే ఎదురింటి పంకజాక్షి, విశాలాక్షి పిలవడంతో ముందుగా వాళ్ళింట్లో కెళ్ళాడు మిరపకాయలమ్మే సైకిల్ వాడు. వాళ్ళో పావుగంట బేరంచేసి కావాల్సినవి కొనుక్కున్నారు.

మిరపకాయలవాడు రోడ్డెక్కాడు.

"ఏయ్ అబ్బాయ్! ఇలారా!" పిలిచింది లలిత.

మిరపకాయలమ్మే వాడు లలిత ఇంటికొచ్చాడు. అప్పటికే పంకజాక్షి, విశాలాక్షి వాకిట్లో నిలబడి చోద్యం చూస్తున్నారు. వాళ్ళని చూసింది గాని లలిత ఏం మాట్లాడలేదు.

"కే.జి. ఎలా?" అడిగింది.

"ముప్పై ఐదు " చెప్పాడు.

"ఇరవై రూపాయల కిస్తావా?"

"అదేంటమ్మ గారు! మరీ అంత తక్కువా?"

"పోనీ ఇంకో రెండు రూపాయలు కట్టుకో..."

"గిట్టదండి. ఇరవై ఐదు కయితే ఇస్తా"

"అయితే నాలుగు కేజీలియ్యి...వందవుతుంది. వంద నోటిచ్చేస్తా" నంది లలిత.

"సరే...సంచితెచ్చుకోండి..." అని నాలుగు కేజీల మిర్చి తూచి ఇచ్చేశాడు మిరపకాయల వాడు. లలిత వందా ఇచ్చేసింది. తీసికెళ్ళిపోయాడు.

లలిత గేటు దగ్గరే ఉంది.


"ఎలా కొన్నారు లలిత గారూ?" అడిగింది పంకజాక్షి.

"పాతిక చొప్పున కొన్నానండి" చటుక్కున చెప్పేసింది లలిత.

అంతే!

ఆ మాటకు వాళ్ళిద్దరూ అవాక్కయిపోయారు. ఖంగుతిన్నట్టు చూసి, కంగారుగా వీధిలోకి పరిగెత్తి, వీధి చివర ఇంకో ఇంటి దగ్గర సైకిలెక్కే ప్రయత్నంలో ఉన్న మిరపకాయల వాణ్ణి పట్టుకొని వెనక్కితీసుకొచ్చారు.

ఒక్కసారి కొనుక్కున్న వాళ్ళు మళ్ళీ ఎందుకు



పిలుస్తున్నారో అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తోంది లలిత.

"చూడబ్బాయ్! నీ దగ్గర ఇంకా ఎన్ని కేజీల మిరపకాయలున్నాయి?"

"నాలుగు కేజీలుండచ్చండి" అని చూపించి వేయించేసుకున్నారు.

అయితే డబ్బులిచ్చేటప్పుడు మాత్రం తాము ముందుకొన్న మిరపకాయలకి కూడా కేజీ పాతిక చొప్పున లెక్కకట్టి, ఎక్కువిచ్చిన కేజీ ఐదు రూపాయలూ ఇప్పుడు తీసుకొన్న డబ్బులకు కలిపి మొత్తం మీద ముందు, వెనక కొన్న అన్ని మిరపకాయలకు కేజి పాతిక చొప్పున డబ్బిచ్చారు.

"ఇదేంటమ్మ గారు! ఇదన్యాయం. ముందు మీరు బేరం చేసే తీసుకున్నారు కదా!" అక్కడికీ ప్రొటెస్టు చేశాడు మిరపకాయల వాడు.

"భలేవాడివేనయ్యా! ఒకే వీధిలో ఇంటికో రేటు అమ్ముతావేటి!" అధి గట్టిగా దబాయించి పంపేశారు.

వాడు సైకిలెక్కుతూ లలితకేసి నిస్సహాయంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

ఆ చూపు ఆమెను బాధించింది.

వాళ్ళు అడగ్గానే రేటు ఎందుకు చెప్పానా అని క్షణకాలం ఫీలయింది. తన తెలివి తక్కువ తనాన్ని నిందించుకుంది.

న్యాయం ఏమిటంటే...వాళ్ళు తనకంటే ముందు కొన్నవాళ్ళు! అలాని తను వాళ్ళెంతకి కొన్నారని రేటు అడగలేదు.

అలాంటప్పుడు వాళ్ళు కూడా తనని రేటు అడక్కూడదు. తీరా అడిగేశాక తాను చెప్పక పోవడం భావ్యంకాదు.

చెప్పింది కదాని...వాళ్ళు మళ్ళీ మిరపకాయల వాణ్ణి పట్టుకొని వేటాడ్డం అసలు మంచి పద్ధతి కాదు.

ఈ బేరసారాల్లో తెలివి ఎక్కువ, తక్కువ ప్రశ్నలేదు. అది కేవలం పరిస్థితులది! ఆ క్షణానికి ఏది తోస్తే అది చేసేస్తాం అంతే! అలా సరిపెట్టుకుని నిట్టూర్చింది లలిత... మరో వర్తకుడి కేక కోసం చెవులు రిక్కించుకుని నిరీక్షిస్తూ...

ఎందుకంటే...చిన్నప్పుడు వాళ్ళమ్మ చెప్పిందట.. వాళ్ళ దగ్గరకొచ్చిన బేరం కాశీకి వెళ్ళినా రాదని...అంచేత.

-ఆకెళ్ళ గిరిజ
ఇ.నం.21-138/3, ప్లాట్ నం.41
ఉత్తమ్‌నగర్, సఫిల్‌గూడ,
హైదరాబాద్ -47.